*"ప్రకృతిగాని భగవంతుడుగానీ మొత్తం నాశనం చేశారు. కానీ, తన సంపాదనకు దారి మూసుకోలేదు, మళ్ళీ బ్లాక్ మనీ దాచుకోవచ్చు. ప్రభుత్వం ఎప్పుడూ పూర్తిగా దారి మూసెయ్యదు, సంపాదించిన దాంట్లో కాస్త లాక్కోవాలని చూస్తుంది తప్ప!"*

# ధన దాహం

## 'ప్రశాంత'

దూరంగా ఆకాశం ఎర్రబడుతున్నాది. అంతకంతకీ ధరల వొత్తిడితో మండిపోతున్న పగటు వాడి గుండె మంటలా ఎర్రబడు తున్నాది. ధరలు పెరుగుతున్నకొద్దీ యింకా యింకా డబ్బు పెంచుకొంటున్న వ్యాపారస్థుడి మనస్సులా ప్రకృతి చల్లగా గిలిగిలిగా వుంది. సుందరం మత్తుగా మగతగా వలిగిన కళ్ళతో సోఫాలోంచి లేచి మెజంతా కలర్ సిల్కులుంగీ సర్దుకొంటూ చుట్టూ చూశాడు.

గదిలో ఎవరూ లేరు. ఖాళీసీసాలు, సిగరెట్ పీకలు సగం తిని చెల్లా చెదురుగా పారేసిన ప్రాన్స్ పకోడీలు, జీడిపప్పు బిర్యానీ అవశేషాలు అన్నీ గతిరాత్రి చరిత్రకి అర్థంగాని లిపిలో ఉన్న అవశేషాలు మాదిరిగా ఉన్నాయి.

పెట్టెలో సిగరెట్స్ అయిపోయాయి. చుట్టూ చూశాడు. రాత్రి సర సాలు సరదాల్లో అంటించకుండా వదిలేసిన రెండు సిగరెట్స్ టేబుల్ పక్కన నలిగి పడివున్నాయి. రెంటికీ లిప్‌స్టిక్ చారలు ఉన్నాయి. అంటే పంకజం నోట్లో పెట్టుకున్నవి అన్నమాట.

సిగరెట్ చూడగానే పంకజం గుర్తుకు వచ్చింది. శరీరం మత్తుగా విరుచుకుంది. రాత్రి బంగళాలో సామాన్యం అయిన అల్లరి జరగలేదు. అందుకే గాబోలు తెల్లవాళ్ళు ఊరికి దూరంగా టి. బి.లు కట్టించే వాళ్ళు! టి. బి. అంటే ట్రావెలర్స్ బంగళా అంటారు గానీ నిజానికి ట్రాన్సాక్షన్ బంగళా అనాలి. దేశంలో పెద్ద పెద్ద ట్రాన్సాక్షన్స్ అన్నీ ఇక్కడే జరగాలి. ఎలాంటి ఆర్డర్స్ అయినా ఇక్కడ రద్దు అవుతాయి, కొత్తవి పుట్టుకొస్తాయి.

ఈ బంగళా అంటే తనకి దేవాలయంతో సమానం. ఇందులోనే ఒక బినామీ కంపెనీ పేర పాతిక లక్షలు అప్పు పుట్టించి, ఆ కంపెనీ ఆచూకీ తెలీదు కాబట్టి ఆ అప్పు రద్దు చేస్తున్నాం అనే ఆర్డర్స్ పుట్టించాడు. అలాగే ఖాళీ గోడౌన్స్‌లో సరుకు ఫుల్‌గా వున్నట్లు సృష్టించి పదిన్నర లక్షలు అప్పు పుట్టించాడు. ఈ బంగళా వెయ్యి టన్నుల ఇనుము, ఐదొందల టన్నుల సిమెంటు ప్రభుత్వం నుంచి ఐదు రూపాయలకి, అర్ధరూపాయికి తెప్పించి పెట్టింది

సోమశేఖరం ఇంజనీర్. అతని కంట్రోలులో ఉన్న ఇనుము తుప్పుపట్టి ఎందుకూ పనికిరాకుండా పోయిందని దాన్ని తుక్కు కింద అమ్మెయ్యకపోతే స్థలం వేస్ట్ అని సోమశేఖరంచేత తనుపుట్టించడం దాన్నిపై అధికారులు అంగీకరించి అమ్మెయ్యడం జరిగిపోయాయి. ఏదో కథలో ఇనుమును ఎలుకలు తినేశాయని ఒక వ్యాపారి తన మిత్రుడ్ని దబాయిస్తాడు. ఇది చిన్నప్పుడు కథలో చదువుకొంది. ఇప్పుడు దేశంలో అంతకన్నా గొప్ప గొప్పవి జరిగిపోతున్నాయి.

సుందరం ఆలోచనల మధ్య తలఎత్తాడు. ప్యూన్ ఏడుకొండలు గదంతా శుభ్రంగా తుడుస్తున్నాడు. రాత్రి జ్ఞాపకాలన్నీ ఓ మూల పోగవుతున్నాయి. వాటిని తీసి బయట పారేస్తాడు. ఆ తర్వాత ఫినాయిల్‌తో గది కడిగి బెడ్‌షీట్స్ మార్చేస్తే గది ఫ్రెష్‌గా వుంటుంది. రాత్రి ఇక్కడ ఏం జరిగిందీ ఎవరి ఊహకీ రాదు

"పంకజంగారు ఫోన్ చేశారండీ...." అన్నాడు ఏడుకొండలు పంకజం ఎందుకు ఫోన్ చేసిందో తనకి తెలుసు. రాత్రి ఎంత మైమరచి మత్తెక్కినట్లు ప్రవర్తించినా తనూ పంకజం ఆఖరి లక్ష్యం మర్చిపోరు.

ఏదో ఒక వ్యవహారంమీద కొన్ని లక్షల రూపాయల డీల్‌కోసం అందుకు సంబంధించిన మనుష్యుల్ని డీల్ చెయ్యడంకోసం ఒక్కోరాత్రి తను ఇలా కొన్ని వందల రూపాయలు ఖర్చు పెడ్తాడు. అందులో పంకజం కూడా ఒకర్తి తెల తెలవారకుండా అందరికన్నా ముందుగా వెళ్ళిపోతుంది. "ఏం అలా వెళ్ళిపోతావ్? ఎవరన్నా నీ తలకొట్టి మొలేస్తారా?" అని తను నవ్వుతూ అడిగితే, "ఖాళీ సీసాని, రాత్రి అనుభవం అయిపోయిన పరదాన్ని తెల్లారి చూస్తే వెగటు వేస్తుంది" అంటుంది నవ్వి.

"హల్లో! ఫోన్ చేశావుట? —"

"ట కోసమే!" రాత్రి అనుభవాన్ని నరాల్లోకి గుర్తుతెస్తూ అటు నుంచి ఒక విరుపు, సగం దగ్గు

"ఏ పని మర్చిపోవు వెరీ ప్రాంప్ట్!"

"వంట చేసుకునేప్పుడే గదా కిరసనాయిల్‌తో పని."

"రాస్కెల్! అయితే రాత్రి మాధవరావుని ఎందుకు పిలిచానో తెలుసునన్నమాట?"

పంకజం నవ్వింది. నరాల్లో రక్తం షాంపెన్‌లా చిమ్మినట్లు నవ్వింది. ఇలాంటప్పుడే తను జాగ్రత్తగా ఉండాలి.

"అన్నట్లు మీకో శుభవార్త."

"వాట్?"

"నా రేటు పెరిగింది. మోహన్‌దాస్‌తో

ఐదువేలు పంపండి."

"నాన్సెన్స్! ఒక్కరాత్రికి ఐదు వేలా?"

"ధరలు పెరిగాయి సార్."

"నీకేం మధ్య?"

"నేమా ఈ దేశంలో మనిషినే. ధరలు పెరుగుదల మాకు తగిలినట్లు మీకేం తగుల్తుంది. మార్కెట్‌లో మాంసంరేటు ఎలా వుందో తెలుసా? ఇదీ ఆ బాపతుదే."

"ఐతేమాత్రం? అందులోనూ వొక్కసారిగా రెండువేలు పెంచేస్తావా? నీకసలు సెన్స్ వుందా?"

"ధరలు పెరగడానికి సెన్స్ సైన్స్ యేమిటి? పంచదార కిలో పదిహేను రూపాయలు! కొబ్బరిమూనె, మటన్ ఒకే రేటు! అఫ్‌కోర్స్ ఇవన్నీ ఎందుకు పెరుగుతున్నాయని ప్రజలు ఎవర్ని అడగాలి? దేరీజ్ నో బడీ టు ఆన్సర్."

"ఏం అయినా నీకు అంత డబ్బు ఇయ్యను. కావాలంటే రేపట్నుంచి మాధవిని పిలుస్తా."

"రేపు మీరు ఎవర్ని పిలుస్తారన్నది నాకు సమస్య కాదు. అసలు నాకు అనవసరంకూడా" ఇప్పుడు ఆమె గొంతులో బిజినెస్‌తప్ప సెలయేళ్ళు, జలపాతాల చప్పుళ్ళు లేవు.

.... .... .... ...."

"ఇంక మళ్ళీ ఫోన్ చెయ్యక్కర్లేదను కొంటా"

"హల్లో! నువ్వింత విశ్వాసరహితురాలివని అనుకోలేదు"

ప్రభుత్వంలో పనిచేసే ఉద్యోగులకి ప్రభుత్వంపట్ల విశ్వాసం లేదు. ప్రజలు ఎన్నుకునే నాయకులకి వాళ్ళపట్ల విశ్వాసం లేదు. వ్యాపారస్తుల సంగతి సరేసరి. వీళ్ళంతా చేసే వ్యభిచారం ముందు మేం చేసేవి తల వంచుకోవాలి. అయినా సుందర్! రాత్రిళ్ళు వ్యాపార సూత్రాలు, తెల్లారి నీతివాక్యాలు వల్లించడం బాగో లేదు. సూక్తిముక్తావళితో ఆరంభం అయి అబద్ధపు వార్తలతో ముగిసే ఆలిండియా రేడియో ధోరణి నాకు గిట్టను బై!"

పంకజం ఫోన్ పెట్టేసింది. ఆ పెట్టడం తనకి చెంపపెట్టులా ఉంది.

'ఈవిచ్ నాలుగు ముక్కలు చదివింది. చదువుకున్న ప్రతి రాస్కెల్ తన అవినీతికి ఆర్గ్యుమెంట్స్ ముసుగు పారేస్తుంటాడు. పంకజంలాంటి బ్యాడ్ సోషల్ ఎలిమెంట్స్‌ని షూట్ చేసి పారెయ్యాలి. ప్రతి వెధవకీ ఆర్గ్యుమెంట్ ఆయుధం అయిపోయింది. సొసైటీలో పెద్దలకి ఇలాంటి వాళ్ళందర్నీ స్పాట్‌లో కాల్చేసే అధికారం ఇవ్వాలి. అవసరం అయితే సొసైటీ సెక్యూరిటీ యాక్ట్ వంటివి పెట్టెయ్యాలి.'







సుందరం నిప్పులు కక్కుతూ వరండాలోకి వచ్చాడు. పంకజంలాంటివాళ్ళు రాత్రికి ఐదువేలు సంపాదిస్తే నెలకి లక్షన్నర రూపాయల రాబడి! వీళ్ళు ప్రభుత్వానికి ఏ టాక్సూ పే చెయ్యరు. ఇలాంటి వాళ్ళవల్లనే బ్లాక్‌మనీ పెరగడం. పేరు తనలాంటి వాళ్ళకి వస్తుంది.

ఏడుకొండలు బ్రీఫ్‌కేస్ తీసుకొచ్చి ఇచ్చాడు "సార్...."

సుందరం విసురుగా మూడు పదిరూపాయల కాగితాలు పారేశాడు. అవి కింద పడ్డాయి. అయినా వాడు వంగి తీసుకోలేదు.

"సార్"

"ఇచ్చానుగా! ఇంకేమిటి?"

"ఓ యాభై ఇవ్వండి. ధరలు మండిపోతున్నాయి సార్. బతకడం కానా కష్టంగా ఉంది సార్"

"దానికి నేనేం చేసేది?"

"ధర్మప్రభువులు మీరే ఆ మాట అంటే ఎలాగండీ?" వాక్యంలో ప్రార్థన గొంతుకో పలకడంలేదు.

ఎలాగయినా యెక్కువ డబ్బులు తీసుకోవాలనే దృఢనిశ్చయం, నిర్ణయం స్పష్టంగా కనిపిస్తున్నాయి..

"పిచ్చిగా వాగావంటే ఈ ఉద్యోగం పీకింపెయ్యగలను. నోరు మూసుకొనిపో."

"నోరు మూసుకొంటే మీరే చూసియిస్తారని యిన్నాళ్ళు అనుకొన్నా కానీ యింక తప్పక నేనే అడిగేస్తున్నా."

"అంత బాధ నీకేం వచ్చిందిరా యిప్పుడు?"

"బియ్యం కిలో ఐదు రూపాయలయిపోయిందండీ ఇంక కూరలు. పుల్లలు సరేసరి అయన్నీ కొనే ఓళ్ళకి తెలుసుద్ది. మీలాంటోళ్ళకేం తెలుసుద్దండీ?—" ఏడుకొండలు యింత ధైర్యంగా ఎలా మాట్లాడుతున్నాడో వాడికి తెలుసు సుందరానికి తెలుసు.

సుందరం ఆ టి.బి.లో చేసే ప్రతి వ్యవహారానికి ఏడుకొండలు మాత్రమే సాక్ష్యం. గాలివెలుగువంటి పంచభూతాలకీ

తెలీదు. ఎందుకంటే బంగళా అంతా ఏ.సి. అక్కడ ఏ పనీ పగలు జరగదు.

ఖచ్చితంగా తనని కాదు పొమ్మంటే ఏం జరుగుతుందో ఏడుకొండలుకి తెలుసు. అదే వాడి ధైర్యం.

"మీకు ధరలు పెరిగితే అందుకు నేనా బాధ్యుడ్ని!" సుందరం యింకో ఐదు రూపాయలు ఆఫర్ చేశాడు. జీవితంలో ధరలు, పరిస్థితులు వాడిలోని కుక్క స్వభావాన్ని చంపేశాయి. లేకపోతే విశ్వాసంతో తల ఆడించేసేవాడు

"వద్దండీ! ఇరవై కావాలి."

"నోర్ముయ్"

"మీరు కాల్చిపారేసిన ఆ సిగరెట్ల ఖరీదు లేదండీ నేనడిగింది...." ఏడుకొండలులాంటి వాళ్ళని, పంకజంలాంటి వాళ్ళని ఎవరు చెడగొడ్తున్నారో సుందరానికి అర్థంకాదు.

ఏంమాట్లాడకుండా కారెక్కబోయాడు. ఏడుకొండలు కింద ఎగుర్తున్న మూడు కాగితాలు గబగబా తీసి ఆయనకే ఇచ్చాడు. మొత్తం తర్వాత ఇయ్యండి అంటూ. కారు బయలుదేరింది. రాత్రి పడ్డ కష్టంలో తనకు లాభించిందని తాలూకు ఆనందం అంతా చెదిరిపోయింది. సుందరం ఆర్గ్యుమెంట్ ఒకటే-తన దగ్గర పనిచేసేవాళ్ళకి ఇస్తున్నదంతా ధర్మానికే. దాన్ని వాళ్ళు హక్కుగా తీసుకుంటారేమిటి అని.

కాసేపు అయాక డ్రైవర్ వీరయ్య కూడా స్టేషన్ ఆన్ చేశాడు. జీతం పెంచమని. సుందరం నసేమిరా ఇయ్యనని వాదించాడు. కానీ ఏం లాభం లేకపోయింది. కావాలంటే ఉద్యోగం మానేస్తానన్నాడు.

"ఉద్యోగం మానేసి ఎలా బతుకుదామనుకుంటున్నావ్?"

"ఉద్యోగంలో ఉన్నప్పుడే నేనెలా బతుకుతున్నానో మీకు అక్కరలేదు ఇంక మానేశాక ఏం అవుతానో మీకెందుకండీ!" అని ఎదురు ప్రశ్న వేశాడు.

చివరికి సుందరం ఏం తేల్చి చెప్పకుండానే బంగళాలోకి కారు వచ్చి ఆగింది. వీరయ్య గబగబా కారు దిగి లోపలికి వెళ్తున్న సుందరానికి కారు తాళాలు ఇవ్వబోయాడు. అంటే తను ఉద్యోగం వదిలేసి వెళ్ళిపోతానని డైరెక్ట్‌గా మొహం మీద చెప్పేస్తున్నాడు.

ఈ మనుషులకి ఎవరు ఇంత ధైర్యం ఇస్తున్నారు! సుందరం సీరియస్‌గా తాళాలు తీసుకొని కార్లోకి పారేసి లోపలికి వెళ్ళిపోయాడు.

వీరయ్య చిత్రంగా నవ్వుకున్నాడు. అతను నవ్వుతున్నాడని సుందరానికి తెలుసు. ఆ నవ్వు తన ఓటమిని ఎత్తి చూపుతుంది. అయినా తనేం చెయ్యలేదు.

## బలుసు తిప్ప
(ముమ్మిడివరం తాలూకా)

అంతులేని నది,
అంతులేని ఆకాశం.
ఏది నది, ఏది ఆకాశం!



ఏకాకి బెస్తవాని గెడ
ఆకాశాన్ని నదిపెట్టి ఛాగించి,
విశ్వమంత సున్నాని
శేషంగా మిగిల్చింది.

—ఇస్మాయిల్

ఆదిత్య హాయిగా ఒలుకుతూ వచ్చి కాఫీ అందించింది. ఆమె ఇచ్చిన కాఫీ, ఆ నవ్వు చాలా వెగటుగా వికారంగా ఉన్నాయి.

"ఏమిటంత పట్టలేని ఆనందం!—"

"మీకెందుకంత చిటపటలు! వెళ్ళిన పని అవలేదా!"

"అయిందిలే" అని బ్రీఫ్‌కేసు అందించాడు.

"ఇవ్వాళ పేపరు చూశారా!"

"ఏమిటి! ఏం అయింది!" చేతిలో కాఫీకప్పు జారి పడింది. "మీ కంగారు బంగారంగాను! డబ్బున్నవాళ్ళకి భయం జాస్తి అంటారు. ఇదేగాబోలు!" ఆదిత్య పళ్ళు ముత్యాల్లా మెరుస్తున్నాయి. గడ్డం కింద ఒంపు భూమి అంచుమీదపడ్డ సూర్యకిరణాల్లా మెరుస్తున్నాది

"ప్రభుత్వం బ్లాక్‌మనీ బయటకు తీయటానికి కొత్త పథకం మొదలు పెట్టింది" సుందరం అసహనంగా వింటున్నాడు. "బ్లాక్‌మనీతో సెక్యూరిటీ బాండ్స్ కొనుక్కోవచ్చునట"

"వీటిని ఏం చేసుకోడానికి! రేపు వాటిని వెయ్యి రూపాయల నోట్లు మాదిరిగా రద్దు చేస్తే ఏం చేస్తావ్!" భర్త ప్రశ్నకి ఆదిత్య ఖంగుతింది.

"ఇన్‌కంటాక్స్ రైడింగ్స్‌తో హడలిపోతున్నారుగదా అని చెప్పా. తర్వాత మీ ఇష్టం...."


"లోపలికి వెళ్ళి అక్కడ్నుంచి....అదే అక్కడ్నించి పది లక్షలు పట్టా" అని సుందరం స్నానానికి బయలుదేరాడు.

సుందరం స్నానం చేస్తుండగా దూరం నుంచి గావుకేక వినబడింది. ఆదిత్యకి ఏం జరిగిందోనని సుందరం తడి ఒంటిమీద టవల్ చుట్టేసుకొని పరిగెట్టాడు.

మేడమీద ఫౌంటెన్ దగ్గర సెమీ అన్‌కాన్షస్ స్థితిలో పిచ్చిదానిలా నిలబడివుంది ఆదిత్య. సుందరం కిందికి చూశాడు. అతని కాళ్ళకింద భూమి విచ్చుకొని ఒరుసుకొని కుంగిపోతున్నట్లు అయింది.

పాతికసంవత్సరాలపాటు శీలాన్నివంశగౌరవాన్ని ప్రాణాన్ని దాచుకొన్నట్లు దాచుకొన్న డబ్బు అంతా చెదలు పట్టేసింది. అక్కడక్కడా ముక్కలు కనిపిస్తున్నాయి అంతే! ఇన్నేళ్ళ కష్టంలో దాచిన డెబ్భై, ఎనభై లక్షల రూపాయలు కాష్టంలో కాలి బూడిద అయినట్లు అయిపోయింది.

కేవలం ఈ డబ్బుకోసం మేడ మీద అందమైన ఫౌంటెన్, దాని మధ్యలో



అందమైన శిల్పం పెట్టించాడు. కింద అంతా పాలరాతి యేర్పాటు. ఆ విగ్రహం తల విడిగా తియ్యడానికి యేర్పాటు. అందులో లాక్‌సిస్టం ఇలా చాలా చేశాడు. ఆ విగ్రహం కింద రెండు గజాలలోతు. అందులోకి నీళ్ళు పోకుండా యేర్పాట్లు. ఆ మధ్యలో లెదర్ బ్యాగ్స్ చాలా జాగ్రత్తగా పెట్టే ఏర్పాటూ చేయించాడు. అందుకు అమెరికాలో వున్న ఒక పెద్ద వాస్తుశిల్పిని పిలిపించి చాలా ఖర్చుపెట్టాడు

త్వరలో కోటి విలువేసి కోటికి పడగలెత్తిన వాడ్ని అనిపించుకోవాలనుకొన్న సుందరానికి ఉరిశిక్ష పడినట్లు అయింది.

మూడు నెల్లపాటు తను విదేశాలకి వెళ్ళినపుడు ఆదిత్యతో మరీమరీ చెప్పాడు. టాంక్‌ని నెలకి వారంరోజులు పొడిగా ఉంచమని. ఆమె నిర్లక్ష్యం చేసింది. ఇండియా తిరిగి వచ్చాక తను ఆర్నెల్లు నిర్లక్ష్యం చేశాడు. ఎంత అవసరం వచ్చినా అందులో డబ్బు తియ్యకూడదనే పట్టుదలతో ఆ వేపు చూడలేదు. టాంక్‌ని ఆదిత్య జాగ్రత్తగా చూసుకొంటుంది అని తను చేసిన అలక్ష్యానికి ఇది వెలచెల్లింపు.

"ఇంత పని జరుగుతుందనుకోలేదండీ! పోయిన నెలలో ఇన్‌కంటాక్స్ వాళ్ళు వచ్చి రెండు లక్షలు పట్టుకెళ్ళినప్పుడు కూడా ఇంత బాధపడలేదు. బంగారం లాంటి డబ్బు మొత్తం మట్టి పాలయిపోయింది. మనం తినలేదు. ఒకళ్ళకి పెట్టలేదు. అయినా మీకు ఒకళ్ళకి పెట్టడానికి అసలు ప్రాణం ఒప్పదుగదా! మనలాంటి వాళ్ళకి దేముడు ఇలాగే చేస్తాడు!" ఆదిత్య ఆవేశంగా అనేస్తున్నది.

నోర్ముయ్ అని సుందరం లాగి చెంప మీద కొట్టాడు "నన్నూ ఆ పనివాళ్ళనీ అన్యాయంగా మీరు కొడితే, మిమ్మల్ని భగవంతుడు కొట్టాడు" అనేసి ఆదిత్య వెళ్ళిపోయింది.

ఎదురుగా వున్న ఎర్ర మట్టి గుట్ట చూస్తుంటే సుందరంలో మనీ వైరాగ్యం పుట్టుకొస్తున్నది. ఛీ ఛీ ఈ వైరాగ్యంలో పడకూడదు అని వెంటనే సంబాళించుకున్నాడు.

అది ప్రకృతిగానీ, భగవంతుడుగానీ మొత్తం నాశనం చేశారు. కానీ తన సంపాదనకి దారి మూసుకోలేదు. తను యథాతథంగా బ్లాక్‌మనీ సంపాదించుకోవచ్చు. ప్రభుత్వం ఎప్పుడూ దారి మూసెయ్యదు. సంపాదించినదాంట్లో కాస్త లాక్కోవాలని చూస్తుంది తప్ప. అందుకే తనకి ఈ ప్రభుత్వం, దాని విధానాలే దైవాలు. మట్టికుప్పను దాటి సుందరం గదిలోకి కొత్త ఉత్సాహంతో వెళ్ళాడు.


# జలుబు వల్ల ఓ మంచి రోజును పాడవనివ్వకండి



## జలుబును పోగొట్టుకోవచ్చు

ముక్కు కారడం, ముక్కు దిబ్బడ, తలభారం, గొంతు నొప్పి, గుండెలో కఫం చేరడం లాంటివన్నీ మీ మంచి రోజుల్ని పాడు చేస్తాయి. అయితే, ఈ లక్షణాలుగల జలుబునుంచి ఉపశమనానికి ఓ మార్గం ఉంది.

## జలుబు మందుతో వాటిని ఎదుర్కోండి

ఏ ఇతర జబ్బుకో చికిత్స చేసినట్టు జలుబుకి చికిత్సచేస్తే చాలదు. జలుబు లక్షణాలకు లోనైన అన్ని చోట్లా ఒకే మారుగా పనిచేసే ప్రత్యేకమైన మందే వాడండి.

## కోల్డరిన్ కేవలం జలుబు కోసమే

మిమ్మల్ని ఇబ్బంది పెట్టే అన్ని జలుబు లక్షణాలనుంచి ఉపశమనం కలిగిస్తుంది కోల్డరిన్. దీనిలోని ప్రత్యేకమైన ఔషధ పదార్థాలు జలుబు లక్షణాలుగల అన్నిచోట్లా కలిసికట్టుగా పనిచేస్తాయి. పైగా మీ శరీరంలో నిరోధక శక్తిని పెంచే విటమిన్ సి దీనిలో ఉంది. మీకు జలుబు చేస్తే, దానికి ప్రత్యేకమైన జలుబు మందే వేసుకోవడం ఉత్తమం.



**కోల్డరిన్**

జలుబు కోసం ప్రత్యేకంగా తయారుచేయబడింది

CASBC-64-232 TL